


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 88 | 13-06-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00





## మీనాక్షికి సుప్రీంలో

# దక్కని ఊరట

### నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత

### ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. 2



## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్

# కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది: సీఎం రేవంత్

**న్యూఢిల్లీ,**

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని కుండ బద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు.



## ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ 2

## పాశ్చాత్య దేశాల

# ద్వంద్వ ప్రమాణాలు



పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించి ందని చెప్పారు. అంతర్జా తీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. 2

### రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్

### అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి




2

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారం

### బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ

## ఆర్ఎస్ఎస్ చీఫ్

# ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

### ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ,**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.



గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



2

## గ్లోబల్ లాజిస్టిక్స్

# డెస్టినేషన్‌గా తెలంగాణ

### షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు



2

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

### ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

## యధాతథంగా సింగరేణి

# మెడికల్ బోర్డు



2

### పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి



## సంక్షేమ శాఖలో

# అవినీతి అంతా అబద్ధం

2

సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

### నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు

### హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

# మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

## నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై



అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరపున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

## ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

### నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్

చెన్నై, అక్షరకలం ప్రతినిధి

ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారం

### బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేనని భావిస్తున్నారు.

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

### రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్

### అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని



గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.



## ముడిచమురు సరఫరాలో అంతరాయం

### ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు

### పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

### షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు




హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.



## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

### పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి

### అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

### నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు

### హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

సిద్ధిపేట, అక్షరకలం ప్రతినిధి

సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

### క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ,

దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు.

# స్వర్గీయ శ్రీ మాజీ శాసనసభ్యులు గట్టు భీముడు కి ఘనంగా నివాళులు అర్పించిన.తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య చైర్ పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య



జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

గద్వాల మాజీ శాసనసభ్యులు గట్టు భీముడు వర్ధంతి సందర్భంగా బలిగేరా లోని వారి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా శ్రీమతి సరిత తిరుపతయ్య మాట్లాడుతూ, గద్వాల చరిత్రలో అగ్రకులాల పెత్తందారులను ఎదిరించి నిలబడి ఎమ్మెల్యేగా గెలిచిన ఒకే ఒక్క నాయకుడు గట్టుభీముడు అలాగే ఆయన చేసిన అభివృద్ధి పనులు మరువలేనివి అన్నారు అలాంటి బిసి నేత మన మధ్యలో లేనందుకు చింతిస్తున్నామని కానీ ఆయన అడుగుజాడల్లో ప్రజలు నడవాలని కోరారు.ఈ కార్యక్రమం లో వారి కుటుంబ సభ్యులు వాల్మీకి బోయ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మెన్ గట్టు తిమప్ప, డీసీసీ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, మధుసూదన్ బాబు, మాబాషా, గౌస్,డీర్ శ్రీధర్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, సద్దాలోనిపల్లి గోపాల్, బజారి ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు....

# పోలీస్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి. పోదేం.వీరయ్య,కి వినతిపత్రం.

అక్షర కలం / భద్రాచలం



తెలంగాణరాష్ట్రపోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులుతమన్యాయమైనడిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోదేం.వీరయ్య,కివినతిపత్రంఅం దజేశారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ,పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని ముప్పై ఆరు సంవత్సరాలకు,ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని ముప్పై ఏడుసంవత్సరాలకుపెంచాలని,అలాగే ఇరవై వేలరూపాయలు పోలీస్ నియామక నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలనికోరారు.గతంలో నియామకాలలో జరిగిన జాప్యాలు, కోవిడ్.ప్రభావంమరియుఇతరకారణ ాలవల్లఅనేకమందినిరుద్యోగయువతఉదో ్యగఅవకాశాలనుకోల్పోయారనిపేర్కొన్నారు.ఈనేపథ్యంలోప్రభుత్వంతమడిమాండ్లనుసానుకూలంగ ాపరిశీలించితగిననిర్ణయంతీసుకోవాలనివిజ్ఞప్తిచేశారు.అభ్యర్థులసమస్యలనుప్రభుత్వందృష్టికితీసుకె ళ్లిన్యాయం జరిగేలా కృషి చేస్తానని పోదేం. వీరయ్య, హామీ ఇచ్చినట్లుతెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు రెండు రోజుల విజ్ఞాన యాత్ర

## ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సందర్శనకు రైతుల బృందం

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంపొందించి, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతుల కు రెండు రోజుల ఆయిల్ పామ్ విజ్ఞాన యాత్రను గురువారం అడిషనల్ కలెక్టర్ సంగీత జెండా ఊపి ప్రారంభించారు. జాతీయ ఆయిల్ పామ్ మిషన్ (చీవీజూ-ఒూ) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన యాత్రకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకెళ్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర తెలిపారు . జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ సంగీత రైతుల బృందం విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ముందుకు రావాలని సూచించారు.రెండు రోజులపాటు కొనసాగే ఈ విజ్ఞాన యాత్రలో రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి సాగు విధానాలు, నాణ్యమైన మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ పద్ధతులు, పంట దిగుబడులు, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా దుబ్బాక నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

అక్షరకలం నల్గొండ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుబ్బాక నరసింహ రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో దుబ్బాక యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు లైన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆల్పా హారం వితరణ చేశారు.ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారు ఉన్నత పదవులు వరించి ముందు ముందు రాజకీయంగా ఉన్నత పదవులు అధిగరోహించాలని ఆ పరమశివుని ఆయన అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకున్నారు.పట్టణంలో ఉన్నటువంటి నిర్మల అనాధ మానసిక వికలాంగుల ఆశ్రమం యందు అన్నదానం,ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.అనంతరం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ముందు ముందు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ జిల్లపల్లి పరమేష్,ఆదిమల్ల శంకర్ ముంతాజ్ అలీ,సుంకిరెడ్డి వెంకటరెడ్డి చర్లపల్లి గౌతం,పగిళ్ల శివ జహంగీర్, మర్రి మదన్ పగిళ్ల రాజు, బెల్లంకొండ సురేష్,ఆకటి సైదులు,మండలి శంకర్ మనిమద్దే పరమేష్,సందీప్ బాలకృష్ణ,మంజునాథ్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# నైపుణ్యాభివృద్ధిపై గీతం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అభివృద్ధి, పరిశ్రమకు సంసిద్ధత, ప్రపంచ ఉన్నత విద్యపై అవగాహనను విద్యార్థులలో పెంపొందించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'జూన్ 2026 సెషన్ సిరీస్' పేరిట ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ)లోని శిక్షణ, మార్గదర్శకత్వం వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ శుక్రవారం విడుదల చేసి ఒక ప్రకటనలో వెల్లడించారు.విజయవంతమైన పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విభిన్న రంగాలకు చెందిన నిపుణులతో గీతం విద్యార్థులను అనుసంధానించడంలో టీఎంసీజీ వేదిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పరస్పర సంభాషణల ద్వారా, విద్యార్థులు తరగతి గది అభ్యాసానికి తోడ్పడే ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందుతారని, ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో విజయవంతమైన కెరీర్ల కోసం వారిని సిద్ధం చేస్తారని వివరించారు.'జూన్ 2026 సెషన్ సిరీస్'లో, ప్రముఖ పూర్వ విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు వర్ధమాన కెరీర్ అవకాశాలు, విదేశాలలో ఉన్నత విద్య, కృత్రిమ మేధస్సు (ఏఐ), ప్రొడక్ట్ మేనేజ్ మెంట్, డేటా అనలిటిక్స్ వంటి అంశాలపై తమ అభిప్రాయాలను, నైపుణ్యాన్ని గీతం విద్యార్థులతో పంచుకుంటారని ఆమె పేర్కొన్నారు.ఇందులో భాగంగా, జూన్ 11న, 'సరిహద్దులకు ఆవల: అమెరికాలో కృత్రిమ మేధస్సు అధ్యయన ప్రయాణం' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటి మాస్టర్స్ విద్యార్థిని శ్రీజ నల్లమోతు ప్రసంగిస్తారని తెలిపారు. జూన్ 12న, 'సరిహద్దులకు ఆవల: విదేశాలలో ఉన్నత విద్యకు మీ ప్రయాణం' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ డల్లాస్ పట్టభద్రుడు హార్దిక్ మల్లిచెట్టి ఉపన్యసిస్తారన్నారు. జూన్ 14న, 'ఉత్పత్తి సంబంధిత పాత్రలను' గ్లోబల్ డేటా పీఎల్సీ ప్రొడక్ట్ అనలిస్ట్ వంశిక సాయి బొత్స పరిచయం చేస్తారని వెల్లడించారు. జూన్ 15న, 'యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్ కు ప్రయాణం' అనే అంశంపై అక్కడి రీసెర్చ్ అసిస్టెంట్ ఆకాంక్ష గోవిందరాజు వివరిస్తారన్నారు. జూన్ 21న, 'డేటా అనలిటిక్స్ భవిష్యత్తును నడిపించడం: కృత్రిమ మేధస్సు, నైపుణ్యాలు, కెరీర్' అనే అంశంపై ఎంఎస్డీ డేటా సైన్స్ మేనేజర్ సమీక్ష నిమ్మే ఉపన్యసిస్తారని తెలిపారు. జూన్ 23న, 'విదేశాలలో ఉన్నత విద్యలో చేరడానికి సరైన సమయాన్ని విశ్లేషించడం'పై నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీ మాస్టర్స్ విద్యార్థిని ఎన్.శ్రేయారెడ్డి సలహాలిస్తారన్నారు. జూన్ 26న, 'స్పష్టతతో, లక్ష్యంతో విదేశాలలో ఎలా చదువుకోవాలి' అనే అంశంపై పోలాండ్ లోని కోజ్మిన్స్కి విశ్వవిద్యాలయం మాస్టర్స్ విద్యార్థి సాయిరామ్ నాగేష్ మార్గదర్శనం చేస్తారని తెలియజేశారు.వీటి ముఖ్య ఉద్దేశం, విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలను అర్థం చేసుకోవడం, ప్రపంచవ్యాప్త విద్యావకాశాలను అన్వేషించడం, విదేశాలలో పనిచేస్తున్న, చదువుతున్న పూర్వ విద్యార్థుల నుంచి లోతైన అవగాహనను పొందడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో విజయవంతమైన వృత్తి జీవితానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సహాయపడటమని డాక్టర్ రోజీనా వివరించారు.ఆయా సెషన్లలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని, వక్తలతో సంభాషించాలని, అలాగే తమ విద్య, వృత్తి జీవితాల గురించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ మాథ్యూ విద్యార్థులను ప్రోత్సహించారు. "విద్యార్థులు అనుసరించాలనుకుంటున్న మార్గంలో ఇప్పటికే విజయవంతంగా పయనించిన వ్యక్తుల నుంచి నేర్చుకోవడానికి ప్రతి సెషన్ ఒక అవకాశాన్ని అందిస్తుంది. ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి అవకాశాలను తీర్చిదిద్దుతాయి" అని ఆమె అన్నారు. ఇప్పటివరకు టీఎంసీజీ వివిధ రంగాలలో 149 నైపుణ్యాభివృద్ధి సెషన్లను విజయవంతంగా నిర్వహించిందని, తద్వారా వందలాది విద్యార్థులకు మార్గదర్శనం, పరిశ్రమ అనుభవం, ఉన్నత విద్యపై అవగాహన కలిగినట్టు డాక్టర్ రోజీనా మాథ్యూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి......

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.....
- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి......
- మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.....

మెదక్/ కొల్చారం జూన్ 12(అక్షర కలం):-

జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, విధి నిర్వహణలో లోపాలు గుర్తించిన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ క్రమశిక్షణకు పెద్దపీట వేస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, శుక్రవారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, వాటి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం లేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలనిసూచించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ, ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని అధికారులకు సూచించారు. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలుస్తూ, వారి ఫిర్యాదులను సక్రమంగా నమోదు చేయడంలో సహకరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయం అందించాలని తెలిపారు.అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సారంగపల్లి అడవిలో గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం

మందమర్రి, జూన్ 12 అక్షర కలం:

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని పురుషుడి అస్థిపంజరం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సారంగపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి కేశవగేని బాలయ్య అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తన మేకలను మేపడానికి సారంగపల్లి అటవీ లోపలికి వెళ్ళాడు. ఆ సమయంలో అడవిలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి, కేవలం అస్థిపంజరం రూపంలో పడి ఉండటాన్ని గమనించాడు. భయాందోళనకు గురైన బాలయ్య వెంటనే ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బచ్చలి రాములుకు సమాచారం అందించాడు. సర్పంచ్ ద్వారా విషయం తెలుసుకున్న సారంగపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య, సర్పంచ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ కేవలం తల భాగం చేతులు, కాళ్ళ ఎముకలు మాత్రమే మిగిలి ఉన్న అస్థిపంజరాన్ని గుర్తించారు. మృతదేహం పక్కన లేత నీలం రంగు ప్యాంటు, దానికి బెల్టు ధరించి ఉంది. మృతదేహంపై చర్మం, మాంసం ఏమీ లేకుండా పూర్తిగా అస్థిపంజరంగా మారిపోవడంతో, అడవి జంతువులు మృతదేహాన్ని తినివేసి ఉంటాయని భావిస్తున్నారు.

?ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య మందమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక ంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, సదరు వ్యక్తి ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం లభించిన ప్రాంతాన్ని క్లూస్ టీమ్, ఉన్నతాధికారులు సందర్శించి ఆధారాలు సేకరిస్తున్నారు.





# పర్యావరణ పరిరక్షణకే 'గ్రీన్ ఎనర్జీ' : మంత్రి పొంగులేటి

- పాలేరు పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ పనులు
- రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు
- తిరుమలాయపాలెంలో సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

తిరుమలాయపాలెం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, విద్యుత్ నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్ల) మరమ్మత్తు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ సరఫరా మెరుగుదలకు పనులు చేపట్టామని, రూ.9 కోట్ల వ్యయంతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు. దశాబ్దాలుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఒకప్పుడు కరెంట్ కష్టాలతో రాత్రివేళల్లో పొలాలకెళ్లి రైతులు పాముకాట్లకు గురైన పరిస్థితులు ఉండేవని, నాటి ఉచిత విద్యుత్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంట్ అందిస్తోందని గుర్తుచేశారు.

**- అర్హులందరికీ సొంతింటి కల..**

అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా మరో 2 వేల ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

**- రైతాంగానికి భరోసా..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచామన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతులకు అండగా నిలిచామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. గడిచిన ఏడాది కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యం కోసం రూ.1,034 కోట్లు వెచ్చించామని, నిరుద్యోగుల కోసం 72 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మమత అరాచకాలకు కాంగ్రెస్ అండ !

మామూలు వావాయి చెప్పులు...ముతక చీర..చంకలో సంచీ వేసుకుని సామాన్య స్త్రీలా కనిపించే ఆహార్యంతో ..పదిహేనేళ్లపాటు బెంగాల్‌ను ఏలిని మమతా బెనర్జీ, ఆ రాష్ట్రాన్ని ఎంతమేరకు భ్రష్టు పట్టించాలో అంతగా భ్రష్టు పట్టించారు. ఏం సాధించారంటే ఏమీ లేదు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం అలవాటు చేసుకున్నారు. సంసారం పిల్లలు లేరు. అయినా మేనల్లుడిని పెట్టుకుని బెంగాల్‌లో రాజ్యమేలారు. నందిగ్రామ్‌తో రాష్ట్రంలోకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుని, ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి..అదే ప్రజలను రాచిరంపాన పెట్టిన రాక్షసిగా పేరుగడించారు. పదిహేనేళ్లుగా అధికార మదంతో తనకు తిరుగులేదనిపించారు. అన్నింటికి మించి భారత భద్రతకు విఘాతం కలిగించారు. పొరుగునే ఉన్న బంగ్లాదేశీయులు యధేచ్ఛగా బెంగాల్లోకి గోడదూకారు. ఇక్కడే తిష్టవేశారు. వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమత బెనర్జీ దేశానికి సవాల్ విసిరిన అక్రమ వలసదారుల ఆగడాలను గుర్తించలేదు. తనకు తిరుగులేదని భావించి అనరాచక పాలనకు తెరతీసారు. రేప్‌లు, మర్డర్లు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా.. పట్టించుకోలేదు. సామాన్యులు భయంభయంగా బతికారు. బిజెపి దెబ్బతో ఇప్పుడు దిమ్మతిరిగి నేలమీద పడ్డారు. తన ఉనికికే సవాల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్‌తో కాళ్ళేరానికి వచ్చారు. అందుకే మమతాబెనర్జీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన 3 రోజులకే మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె అస్సాం సీఎం హిమంత శర్మతో సమావేశమయ్యారు. త్వరలో ఆమె బీజేపీలో చేరతారని సమాచారం. అస్సాంకు చెందిన సుష్మితా దేవ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె. గతంలో ఆమె అస్సాంలోని సిల్చార్ నుంచి గెలుపొందారు. ఇకపై అస్సాంలోనే రాజకీయాలు చేస్తానని, బెంగాల్‌లో కాదని ఆమె స్పష్టం చేశారు. తాజాగా ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ దాదాపు టిఎంసి ఖాళీ అవుతోంది. నిజానికి ప్రాంతీయ పార్టీలు ఇంతగా దెబ్బతిన్న దాఖలు ఏ రాష్ట్రం లోనూ లేవు. మమత మీద విశ్వాసం లేదంటే ఆమె ఎంతగా నియంతలా వ్యవహరించారో తెలిసిపోతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్నారు. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. జగదీశ్ చంద్ర మసునియా, ఖలి ఉర్ రహమాన్, అబు తాహిర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాలీపాద సొరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రవర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ కూడా తిరుగుబాటుదారుల బృందంలో ఉన్నారు. టీఎంసీకి లోక్‌సభలో 28 మంది సభ్యులుండగా 19 మంది రెబల్స్‌గా ప్రకటించుకున్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 64 మంది తిరుగుబాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చీలికలు, నేతల రాజీనామాల నేపథ్యంలో ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత సోనియాగాంధీ ప్రతిపాదించినట్టు సమాచారం. మమతను దారికి తెచ్చుకోవడానికి, బెంగాల్లో కాలు మోపడానికి కాంగ్రెస్‌కు ఇదొక్కటే అవకాశం. అయితే ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు కొంత సమయం కావాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోరినట్టు సమాచారం. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయి, బీజేపీ పాలన ప్రారంభమైన దరిమిలా.. టీఎంసీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. మరోవైపు బీజేపీ నుంచి ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమే పరిష్కారమని సోనియా సూచించినట్టు తెలిసింది. మరోవైపు, అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నేత రాహుల్‌తో భేటీ అయ్యారు. టీఎంసీ అగ్రనేతలుగా ఉన్న వారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిస్తామని ప్రకటించారు. దీంతో పార్టీ భవితవ్యంపై మమత తల్లడిల్లుతున్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలన్నది మరింత ఇబ్బందికరంగా మారింది. 64 మంది ఎమ్మెల్యేలు.. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో చీలిపోగా, 28 మంది ఎంపీల్లో 20 మంది కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో విడిపోయి.. ఎన్డీయేకు మద్దతిస్తామని, తమను ప్రత్యేక సమూహంగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖరాశారు. ఈ పరిణామాలతో టీఎంసీ పార్టీ మమత చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. చీలిక వర్గాలకు 'గుర్తింపు' లభిస్తే.. పార్టీ గుర్తు, జెండా సహా టీఎంసీ ఆస్తులపైనా హక్కులు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ఢిల్లీలో సోనియాగాంధీని కలుసుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం బుధవారం కూడా మరోసారి ఇరువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే సోనియాగాంధీ.. విలీన ప్రతిపాదనను మమత ముందు ఉంచారని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా బీజేపీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారని పేర్కొన్నాయి. టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, మమతా బెనర్జీకి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవితోపాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ప్రధాన కార్యదర్శి పదవులు ఇస్తామని సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టు తెలిపాయి. ఈ ప్రతిపాదనపై తక్షణమే నిర్ణయం తీసుకోలేనని, కొన్ని రోజుల సమయం కావాలని మమత కోరినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ విలీన ప్రతిపాదన వార్తలపై బెంగాల్ కాంగ్రెస్ విభాగం సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో




స్పందిస్తున్నారు. అక్రమార్కులు, అన్యాయాలు చేసిన పార్టీని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటారని నిలదీస్తున్నారు. అధికారికంగా దీనిపై ప్రకటన వచ్చాక తమ నిర్ణయం వెల్లడిస్తామని కొందరు నేతలు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు కూడా చిక్కులు తప్పేలా లేవు. గతంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన మమత.. 28 ఏళ్ల కిందట 1998లో కాంగ్రెసతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వరుసగా మూడు సార్లు బెంగాల్ ఎన్నికల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చారు. అయితే ఆమె పార్టీని కూడా సరిగా నడపలేరని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో అక్రమాలు చేఇవుంటే తప్ప ఇప్పుడు బిజెపికి భయపడాల్సిన అవసరం లేదు. కానీ అరాచక పాలన సాగించిన పాపానికి ఆమెకు భవిష్యత్ ఉంటుందా అన్నది అనుమానమే.

# పర్యావరణానికి తూట్లు హరితహారం లక్ష్యం గాలికి

**అక్షర కలం సిద్దిపేట జూన్ 12:**

రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో పర్యావరణ పరిరక్షణకు వందల కోట్లు ఖర్చు చేస్తుంటే మరోవైపు చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో విలువైన వృక్షాలను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న, సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న చెట్లను నరికి లారీలు మరియు ట్రాక్టర్ల ద్వారా పట్టపగలే తరలిస్తున్న రెవెన్యూ పంచాయతీ అటవీ మరియు రోడ్లు భవనాల శాఖ అధికారులు పాటించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాల్టా చట్ట ప్రకారం అనుమతి లేకుండా జిరాయితి భూముల్లో చెట్లను తీయకూడదు. కానీ చెరువులు, గ్రామ కంటాలు, ప్రభుత్వ స్థలాల్లోని వృక్ష సంపదను తరలిస్తున్న అధికారులు అభ్యంతరం తెలుపకపోవడంతో వెనక పెద్ద ఎత్తున కాసులు చేతులు మారడమే కారణమని ప్రజలు





ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం లక్ష్యానికి ఈ నరికివేత ఘటనలు తూట్లు పొడుస్తున్నాయి. చెట్లు కేవలం నీడనే కాకుండా నేల సారాన్ని పెంచడంలో, వర్షపాతం సమతుల్యతలో, గాలి కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, అక్రమ నరికివేత ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వ్యవసాయానికి నష్టం వాటిల్లుతుందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నంత అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో ప్రాంతాల్లో ప్రత్యక్షంగా సందర్శించి అక్రమ కట్టే రవాణా చేస్తున్న వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకొని అడవులను రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## స్వచ్ఛ సిద్దిపేటలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి



**అక్షర కలం సిద్దిపేట జూన్ 12:**

స్వచ్ఛ సిద్దిపేటలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా మున్సిపల్ కార్యాలయం లో పట్టణంలోని ప్లాస్టిక్ దుకాణ సముదాయాల,మాంసం, దుకాణాల కిరాణా,ఫంక్షన్ హాల్ యజమానులతో సింగిల్ ప్లాస్టిక్ నిషేధించడం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం తగ్గించి స్టీల్ బాక్స్, నారా, జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. నివాస సముదాయాల నుంచి వెలువడే చెత్తను తడి పొడి హానికరమైన చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలన్నారు. ప్లాస్టిక్ దుకాణ సముదాయాలు, ఫంక్షన్ హాల్స్, సూపర్ మార్కెట్లు,కిరాణా దుకాణాలు మాంసాహారం సముదాయాలలో నిత్యం సోదాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈ రవీందర్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, టిపిఓ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ సంజీవి నీ వంటిది

**పూజల హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి**

**రెండు లక్షల రూపాయల విలువైన ఎల్ వో సి అంద చేసిన ఇంచార్జ్ పూజల హరికృష్ణ**

**అక్షర కలం సిద్దిపేట జూన్ 12:**



సిద్దిపేట పట్టణానికి చెందిన ఆడెపు సాయి చరణ్ ఎత్తు పెరగడానికి హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు చికిత్స కోసం 4 లక్షలు అవసరమవుతాయని ఆసుపత్రి వర్గాలు ఎస్టిమేషన్ కాపీ ఇవ్వగా పూజల హరికృష్ణ మంత్రులు కొండా సురేఖ వివేక్ వెంకట్ స్వామి తో మాట్లాడి సిఎంఆర్ఎఫ్ నుంచి 2 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన రెండు లక్షల విలువ గల ఎల్ఓసి పత్రాన్ని సాయి చరణ్ కుటుంబ సభ్యులకు శుక్రవారం పూజ ల హరికృష్ణ అందజేశారు. మూడేళ్లు సాగే ఈ చికిత్స కోసం ఇదివరకే రెండు లక్షల 75 వేల మంజూరు అవగా ప్రస్తుతం మరో రెండు లక్షలు మంజూరు అయ్యాయి. చికిత్స నిమిత్తం మొత్తం రూ 4,75,000 లు మంజూరు చేయించినందుకు సాయి చరణ్ కుటుంబ సభ్యులు పూజల హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలు ఎవరైనా తమను సంప్రదిస్తే సీఎం ఆర్ ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని పూజల హరికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమము లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంగ సాంబమూర్తి,దేశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**రాష్ట్ర రవాణాశాఖ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**అక్షర కలం సిద్దిపేట జూన్ 12:**

సంక్షేమ శాఖలో అవినీతి జరుగుతుందంటూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హుస్నాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడి తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నారని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మైనార్టీ ఎస్సీ,బీసీ,సంక్షేమ శాఖలను వరుసగా మైనార్టీ ఎస్సీ,బీసీ వర్గాలకు చెందిన మంత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పారదర్శకతను కాపాడేందుకు నిర్ణయాధికారాన్ని పూర్తిగా ప్రిన్సిపల్ సెక్రెటరీ సవ్యసాచి గోష్ కు అప్పగించామని చెప్పారు. నాణ్యత పారదర్శకతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంటే గత ప్రభుత్వంలో జరిగినట్లే ఇప్పుడు కూడా అవినీతి జరుగుతోందనే భ్రమలో



హరీష్ రావు ఉన్నారని విమర్శించారు. అవినీతి జరిగిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అని హరీష్ రావుకు సవాల్ విసిరారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీష్ రావుకు సూచించిన మంత్రి,పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే అలాంటి వ్యాఖ్యలను విరమించుకోవాలని హరీష్ రావుకు హితవు పలికారు. మంత్రి అజారుద్దీన్, మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ కలిసి స్పష్టంగా చెబుతామని సంక్షేమ శాఖల అవినీతి జరిగిందని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు.

## చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు.




**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులకు కఠిన చర్యలు తప్పవని జిల్లా కార్మిక అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకొని గద్వాల జిల్లాలోని దుకాణాలు, సంస్థల యజమానులకు స్థానిక ప్రభుత్వ ప్రాక్టీస్ సింగ్ హైస్కూల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ దుకాణాలు మరియు సంస్థల యజమానులు 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టపరంగా నేరం అని, ప్రమాదకరమైన పని ప్రదేశాలలో 18 సంవత్సరాల లోపు పిల్లలని కూడా పనిలో పెట్టుకోకూడదని, పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకొని పోలీస్ కేసులు పెట్టి జైలు శిక్ష పడేలా చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు . ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 1098 నెంబర్ కు సమాచారం అందించాలని తెలియచేశారు, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, అందరూ సామాజిక బాధ్యతగా బాల కార్మిక నిర్మూలనలో భాగస్వామ్యులు కావాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆఫీసర్ విద్యులత, లేబర్ ఆఫీసర్ కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తో పాజి ప్రమాణ స్వీకారం



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన తోపాజి అనంత కిషన్ హైదరాబాద్ లోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్ శనివారం ప్రమాణస్వీకారం నిర్వహించారు. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ సమక్షంలో తోపాజి అనంత కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంత కిషన్ మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు


## ఇజ్రాయెల్ దేశంలోని ఆరోగ్య సంస్థల్లో స్టాఫ్ నర్స్ (హోమ్ బేస్డ్ కేర్ గివర్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలోని ఆరోగ్య సంస్థల్లో స్టాఫ్ నర్స్ (హోమ్ బేస్డ్ కేర్ గివర్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలు ఇజ్రాయెల్‌లో ఉండగా మహిళలకు 90% పురుషులకు 10 % అవకాశాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 25 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ూచీవీ, +చీవీ, ాీూఎఔ, డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ లేదా బి.ఎస్సి నర్సింగ్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల భాషా పరిజ్ఞానం కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు లేదా ఇతర ఆరోగ్య సంస్థల్లో నర్సింగ్ సేవల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు 5,880.02 ఎన్.ఎస్.ఐ వేతనం లభిస్తుందని, ఇది సుమారు 2,000 అమెరికన్ డాలర్లు లేదా రూ.1.93 లక్షలకు సమానమని పేర్కొన్నారు. ఉద్యోగ ఒప్పంద కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని, నివాసం, వైద్య బీమా తదితర సదుపాయాలు ఇజ్రాయెల్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్పించబడతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా సివి ను ˆశీఎశీఎస్త్రశ్రీశీఝశ్రీఏస్త్రఝఅశ్రీ.ఎశీఎ కు పంపాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9440052081, 9440051763, 9440052592, 9440049645 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట







# టీమిండియాపై నోరుపారేసుకున్న ఖుష్‌దిల్ షా

దాయాది జట్లు భారత్, పాక్ దేశాల మధ్య జరిగే క్రికెట్ సమరం కేవలం ఆట మాత్రమే కాదు.. అది కోట్ల మంది అభిమానుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఓ మహా సంగ్రామం. ఇలాంటి హై-వోల్టేజ్ మ్యాచ్‌ల గురించి ఏ చిన్న వివాదాస్పద కామెంట్ వచ్చినా అది క్షణాల్లో సంచలనంగా మారుతుంది. తాజాగా పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఖుష్‌దిల్ షా భారత్-పాక్ మ్యాచ్‌లపై చేసిన కొన్ని వివాదాస్పద కామెంట్లు క్రికెట్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపాయి. భారత్‌తో జరిగే మ్యాచ్‌లలో అంపైరింగ్ నిర్ణయాలతో పాటు చాలా విషయాలు భారత జట్టుకే అనుకూలంగా వెళ్తాయంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశాడు.

# ఫ్రెంచ్ టైటిల్?ను ముద్దాడిన జ్వెరెవ్

## పురుషుల సింగిల్స్ ఫైనల్?లో విజయం


## ఫ్లావియో కోబోలీని మట్టికరిపించిన జ్వెరెవ్

జర్మనీకి టెన్నిస్ స్టార్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఎట్టకేలకు తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్?ను ముద్దాడాడు. ఆదివారం ఫ్రాన్స్?లో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్?లో జ్వెరెవ్ విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన ఈ ఫైనల్?లో జ్వెరెవ్? ఇటలీకి చెందిన ఫ్లావియో కోబోలీని 6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో ఓడించి ఛాంపియన్‌గా నిలిచాడు. దీంతో జ్వెరెవ్ ఎమోషనల్? అయ్యాడు. విజయం అందుకున్న వెంటనే అతడు నేలపై పడుకొని కన్నీళ్లు కార్చాడు. ఒక్క టైటిల్?కే అంతలా ఎమోషనల్ అవ్వాల్సిన పని ఏముంది అని అనుకోవచ్చు! కానీ జ్వెరెవ్?కు ఇది సాధారణం విజయం కాదు. కెరీర్?లో ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఈ విజయం సాధించాడు.మనమంతా గ్రౌండ్?లో చూస్తున్న జ్వెరెవ్ వేరు. అతడు ఒక అధ్భుత ఆటగాడని అంతరికీ తెలుసు. కానీ, అతడు గత 25ఏళ్లుగా సుదీర్ఘ కాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్నాడని అనేక మందికి తెలియని విషయం. 4ఏళ్ల చిన్నతనంలోనే టైప్- 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్, 25 ఏళ్లుగా అనేక కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా కుంగుబాటుకు గురవ్వకుండా తల్లిదండ్రుల సాయంతో ముందడుగు వేశాడు. వ్యాధితో బాధపడుతున్నా వెనక్కి తగ్గకుండా పోరాడాడు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కెరీర్?లో రాణించాడు.టెన్నిస్?లో కొనసాగాలంటే శారీరక శ్రమ చాలా అవసరం.

# ఫిఫా వరల్డ్ కప్ సంగ్రామం

ఎంత ఆదరణ కలిగిన క్రీడా సంబరం ఫీఫా ప్రపంచకప్ మరోసారి సరికొత్త రికార్డులతో మన ముందుకురాబోతోంది. 2026లో జరగబోయే ఈ టోర్నమెంట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఇప్పటి వరకు మనం చూసిన ప్రపంచ కప్‌ల కంటే ఇది భిన్నంగా, భారీగా ఉండబోతోంది. ప్రపంచకప్ ఎందుకు ప్రత్యకమైందో తెలుసుకోవాలంటే ముందుగా దాని పరిమాణాన్ని చూడాలి. గతంలో 32 జట్లు మాత్రమే టోర్నీలో పాల్గొనేవి. కానీ ఈసారి ఏకంగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరుకుంది. ఇది ఫుట్‌బాల్ ప్రపంచంలో అతి పెద్ద, సుదీర్ఘమైన టోర్నమెంట్‌గా నిలవనుంది. సుమారు 39 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులను ఈ టోర్నీ ఉర్రూతలూగించనుంది. ఈ మెగా టోర్నీకి ఉత్తర అమెరికా ఖండంలోని మూడు దేశాలు కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జూన్ 11న మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మకమైన మెక్సికో సిటీ స్టేడియంలో ఘనంగా ప్రారంభంకానుంది. ఆతిథ్య దేశం మెక్సికో తన సొంత గడ్డపై స్థానిక అభిమానుల కేరింత మధ్య తొలి మ్యాచ్ ఆడనుంది. జులై 19న న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది. ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఫిఫా జట్ల సంఖ్యను పెంచింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# సినిమా

CINEMA



# బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల

పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె.హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## రామాయణంలో భాగం కావడం

# అదృష్టం: కాజల్

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.



# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

## పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట

ప్రకృతిని ప్రేమించడం..అనుభవించడం..ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాన ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# జిపి కార్మికులకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

గ్రీన్ ఛానల్ ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్

అక్షరకలం నల్గొండ

గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్గొండ కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, డిపిఓ శంకర్ నాయకులకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందర మేము అధికారంలోకి వస్తే కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేస్తామని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు



చేస్తామని, అర్హత కలిగిన కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. వేతనాలు కూడా ఐదు నెలలుగా పెండింగ్ లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడితేనే వేతనాలు వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. ముఖ్య ముఖ్యమంత్రి గారు మాత్రం గ్రీన్ గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తామని అందుకోసం 50 కోట్ల బడ్జెట్ ప్రతినెల ఇస్తామని మాటలు చెబుతున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. సలీం, యూనియన్ జిల్లా కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హరిస్తూ లేబర్ కోడ్స్ తెచ్చిందని వీటికి ఈ రాష్ట్రంలో అమలు చేయకుండా కార్మిక వర్గం సమరసిల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలు చేసినప్పుడు తమ మద్దతు ఇచ్చి మేము అధికారంలోకి వస్తే సమస్యలన్నీ తీరుస్తామని చెప్పిన వారు నేడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గ్రామపంచాయతీ అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సెలవు ఇవ్వకుండా అధిక పనిగంటలతో సర్పంచులు కార్యదర్శులు వేధిస్తున్నారని ఆరోపించారు. సెలవుల పేరుతో వేతనాలు అడ్డగోలుగా కోత విధిస్తున్నారని అన్నారు. బట్టలు సబ్బులు చెప్పులు నూనెలు, పోస్టల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని ఆదేశాలు ఉన్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పొన్న అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న యూనియన్ జిల్లా నాయకులు ఇరిగి ఎల్లేష్ కొండేటి నరసయ్య పి సర్వయ్య ఏ యాదమ్మ గండమల్ల ఆశీర్వాదం ఏర్పుల సైదులు సురేష్ యాదయ్య మంగారెడ్డి రామలింగయ్య జానయ్య సైదులు నరసింహ రమేష్, లింగమ్మ పెద్దమ్మ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీబీనగర్‌లో 'ప్రిన్స్ జ్యూస్ సెంటర్' ప్రారంభం





అక్షరకలం బిబినగర్

బీబీనగర్ మండలం పోచంపల్లి రోడ్డులో షేక్ మొయిన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రిన్స్ ఫ్రెష్ ఫ్రూట్స్ అండ్ జ్యూస్ సెంటర్' ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై, షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగ్రెపల్లి ఆంజనేయులు శర్మ, తిప్పిరిశెట్టి సత్యనారాయణ గుప్తా, ఉప్పా సర్పంచ్ గోలి నర్సింహా రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ. అక్బర్, పింగల్ అన్న సేవాదళ్ ప్రతినిధులు కాసుల రఘునందన్ గౌడ్, ఎండీ. మొయిన్, తుమ్మల నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ మన్నె బాలరాజ్, యూత్ టౌన్ ప్రెసిడెంట్ ఉప్పాలంచి శ్రీకాంత్, ఎండీ. అస్లాం బేసిత్, నరేందర్, నవీన్, లాలయ్య, శ్రీధర్, షోయబ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## పడమటి సోమవారంలో బడిబాట కార్యక్రమం



అక్షరకలం బీబీనగర్

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే ఫ్రైడే డ్రైడే ప్రోగ్రాం లో కూడా పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆల్వ లింగారెడ్డి నూనె అమృత రాములు ఆముదాల సదానందం ఎండి రేష్మ ఉస్మాన్ నూతన సెక్రటరీ పవన్ కుమార్ వాళ్ళ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది ఆశా వర్కర్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, స్కూల్ హెచ్ఎం, టీచర్స్ పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పాలకూరి శేఖర్‌కు సీపీఎం నాయకుల నివాళి



అక్షరకలం నల్గొండ

సీనియర్ జర్నలిస్ట్ పాలకూరి శేఖర్ పార్థివ దేహంపై పూలమాలలు వేసి సీపీఎం జిల్లా, పట్టణ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ శేఖర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, జర్నలిజం రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు, పాత్రికేయులు, అభిమానులు అంతిమయాత్రలో పాల్గొని తమ నివాళులు అర్పించారు. పాలకూరి శేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటూ సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, నల్లగొండ పట్టణ, మండల కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, నలపరాజు సైదులు, మండల కమిటీ సభ్యులు బొల్లు రవీందర్, పాల్గొన్నారు.

## ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలి -డీఆర్ఓ కు డీవైఎఫ్ఐ వినతి

అక్షరకలం నల్గొండ



టీజీపీఎస్సీ ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజులను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లో నల్గొండ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఆర్. దశరథ్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ, తెలంగాణలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో టీజీపీఎస్సీ ప్రాసెసింగ్ ఫీజును రూ.200 నుండి రూ.1,000కు పెంచడం యువతపై అదనపు ఆర్థిక భారం మోపడమేనని అన్నారు. ఇప్పటికే నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, పుస్తకాల కొనుగోలు, ప్రయాణ ఖర్చులు తదితర వ్యయాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఫీజుల పెంపు వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గుణాలపురి బాలరాజు, బూర్గు గోపి,లింగరాజు, సాయిపాల్గొన్నారు.

## మైనారిటీ యువతకు నైపుణ్య శిక్షణ

అక్షరకలం నల్గొండ

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నాయి. ఈ శిక్షణను నిర్వహించడానికి టాస్క్, ఈజీఎంఎం, మెప్మా, ఎన్ఎస్డిసి, ఎన్ ఐ - ఎం ఎస్ ఎం ఈ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన, అనుభవజ్ఞులైన శిక్షణ భాగస్వామ్య సంస్థల నుండి ప్రతిపాదనలు కోరుతున్నారు. ఆసక్తి గల సంస్థలు తమ ప్రతిపాదనలను నల్గొండలోని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి. విజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు 'టెట్' నుండి మినహాయింపు ఇవ్వాలి- టిపియూఎస్ డిమాండ్

అక్షరకలం నల్గొండ

ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణలోని దాదాపు 50 వేల మంది ఉపాధ్యాయులపై ప్రభావం చూపనుందని తపస్ జిల్లా అధ్యక్షులు బత్తిని భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, ఉపాధ్యాయుల్లో మాత్రం ఆందోళన వ్యక్తమవుతోంది. గత 30 ఏళ్లుగా తాము బోధిస్తున్న సబ్జెక్టులతో సంబంధం లేకుండా, టెట్ కోసం అన్ని సబ్జెక్టులను చదివి పరీక్ష రాయాల్సి రావడం అసంబద్ధమని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇప్పటికే ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో దీక్ష, నిష్ఠ వంటి ఆన్‌లైన్ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు సమకాలీన బోధనా పద్ధతుల్లో శిక్షణ పొందుతున్నారు. 1 ఏప్రిల్ 2010 కంటే ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు అసలు టెట్ ప్రస్తావనే లేదని కావున వారికి మినహాయింపు ఇవ్వాలని 'తపస్' ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి 1 ఏప్రిల్ 2010 కంటే ముందు నియామకమైన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల రాజశేఖర్, రాష్ట్ర సంఘ నాయకులు ఇరుగు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, విజయ్ కుమార్, కిషన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




## చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా వెంకటేశం బాధ్యతల స్వీకరణ

అక్షర కలం, చౌటుప్పల్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా నందగిరి వెంకటేశం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్ఠం చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రెడ్డిబావి గ్రామానికి చెందిన వెంకటేశం బాధ్యతలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## టీయూవీ జిల్లా ఉపాధ్యక్షుడిగా జోగు అశోక్ కుమార్

అక్షర కలం : చిట్యాల



తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిట్యాల మండలం తాళ్లవెల్లెంల గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు జోగు అశోక్ కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ లు జోగు అశోక్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో జోగు అశోక్ కుమార్ చురుకైన పాత్ర పోషించారని, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు నాయకులు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి జోగు అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం సంస్థ ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఎసిబికి చిక్కిన ఎంపిడివో,ఎంపివో

లంచం తీసపుకుంటుండగా పట్టివేత

పటాకులు కాల్చి సంబరం చేసుకున్న గ్రామస్థులు

మహబూబాబాద్, భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావతిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మొత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

### తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి

### తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు

### కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు

### హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా

### మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్

### ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ

**న్యూఢిల్లీ,**

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చున్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.



తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# గంజాయితో పట్టుబడ్డ మోడల్ మిస్ హర్ష సన్నీ

### బ్యాంకాక్ నుంచి ముంబై రాగా పట్టివేత

**ముంబై,**

:మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై-క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు 'ఎన్‌డిపిఎస్' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది. హర్ష సన్నీ వద్ద దొరికిన 11 కిలోల గంజాయి విలువ అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆమెపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

### ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం

### కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం

**కరీంనగర్,**

రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది.

# సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

### చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం,**

ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్టాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు.

# ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వివక్ష

### హెల్త్ కార్డులు ఇవ్వకుండా రాజకీయం

### మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్, ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు, పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి
రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు.హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్ కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు.బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నా మని వెల్లడించారు. ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు. ద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.

# తిరుగుబాటు ఎంపిల కొత్త ఎత్తుగడ

### తమదే అసలైన టిఎంసిగా వాదన

### స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందకు సన్నద్ధం

**న్యూఢిల్లీ,**

తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే 'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు. లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్టుగా ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ గ్రూపులో శతాబ్దీ రాయ్, యూసుఫ్ పఠాన్, సయోనీ ఘోష్, శత్రుఘ్నసిన్హా తదితర ఎంపీలు ఉన్నారు.

# పోలీసు సిబ్బంది ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం

### పోలీస్ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు: పోలీస్ కమిషనర్



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్యానికి పోలీస్ శాఖ ప్రాధాన్యమిస్తోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ, టూడీ ఈకో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిభిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారని, కుటుంబంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, ప్రాణాంతక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమైన గుండె వైద్య పరీక్షలు ఈసీజీ,టూడీ ఈకో పరీక్షలను యశోద వంటి ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, సిబ్బందికి ఈ ఆరోగ్య ప్రొఫైల్స్‌ను అందిస్తున్నాయట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యశోద హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు భరత్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం "దిశా" కమిటీలో సర్పంచ్ లకు పెద్దపీట..

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండేలా ప్రాధాన్యమిస్తూ ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

**డి సురేంద్రబాబు/ భద్రాద్రి కొత్తగూడెం /అక్షర కలం ప్రతినిధి:**



జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశా) కమిటీకి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఐదుగురు సర్పంచ్ లకు చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పర్యవేక్షణ ఉండేలా వీరి నియామకంలో ప్రత్యేక చొరవ ప్రదర్శించారు.

దిశా కమిటీ సభ్యులు వీరే..

భుక్యా సునీత (సర్వారం, సుజాతనగర్ మండలం), బానోత్ శారద (రేపల్లెవాడ, ఇల్లందు మండలం), కోర్స రాజేష్ (తిరుమలకుంట, అశ్వారావుపేట మండలం), కల్లూరి ఆదినారాయణ (నారాయణరావుపేట, దుమ్ముగూడెం మండలం), మద్దెల సమ్మయ్య (పొట్లపల్లి, పినపాక మండలం).

?అణగారిన వర్గాలకు అవకాశాలు..

ఐదుగురు గ్రామ పంచాయతీ సర్పంచులకు చోటు దక్కగా..ఇందులో ఇద్దరు మహిళా సర్పంచులు ఉండటం విశేషం. గ్రామీణ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్న ఎంపీ సంకల్పానికి ఈ నియామకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయంటూ..జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు .. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 12:**

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జూన్ 13వ తేదీన జిల్లాలో పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డిసిపి ఎ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, దండేపల్లి మండల తహశీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈఓ శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జూన్ 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డిసిపి, మంచిర్యాల శాసనసభ్యులు, ఎసిపి ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలను తొలగించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఐ ఎఫ్ టి యు ధర్నా.

**అక్షర కలం / ఇల్లెందు.**



ఇల్లందు కొత్త బస్టాండ్ ఆటోస్టాండ్ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల ఆటోడమోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్, కమిషనర్ గార్లకు వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆటోడ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు,ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా ఇల్లెందు బస్టాండ్ వద్ద ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆటోస్టాండ్ ను ఏర్పాటు చేసుకొని వివిధ గ్రామాలకు ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ స్థలంలో కొక్కు సారయ్య అనే వ్యక్తి అక్రమంగా షాపు ఏర్పాటు చేసుకున్నాడని అన్నారు. దీనివల్ల ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఆటోస్టాండ్ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని,ఆటో కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబందించి ఇల్లందు ఎస్ హెచ్ ఓ కు వినతిపత్రం అందచేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల ఆటోడమోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు)ఇల్లెందు బ్రాంచ్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పల్లి సుధాకర్,డి.మోహన్ రావు నాయకులు కాంపాటి కిరణ్ కుమార్,అజ్మీర రవికుమార్,బానోత్ శ్రీను,బానోత్ సకిందర్,మూడు నరేష్,జరుపుల లక్ష్మణ్,బానోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

### - కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర
### - 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్
### - బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు
### - కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి
### - పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఏదులాపురం మున్సిపాలిటీ :లికేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

- 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.



### - నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

### - సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరపున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### - ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 12:**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహ నిర్మాణానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, మండల తహశీల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మహాత్మ జ్యోతిబా పూలే ఆర్సిఓ బాల భాస్కర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో తాండూర్ మండలంలో 1 కోటి 95 లక్షల రూపాయల ఎస్డిఎఫ్ నిధుల అంచనా వ్యయంతో మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, మండల విద్యాధికారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 లక్షల 50 వేల రూపాయల సమగ్ర శిక్ష అంచనా నిధులతో పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మించడం జరిగిందని తెలిపారు. గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955